# ఉపదేశం

రచన :
శ్రీమతి ప[illegible]నేని శ్రీశైల భ్రమరాంబ.

కోటయ్య రోజంతా యంత్రంలా పనిచేసి ఇంటి కొచ్చే సరికి పక్కమంచంలో పడివున్న తల్లినీ, నీరసంతో మూల్గే నిండు చూలైన భార్యని, ఎండు డొక్కలతో అల్లాడే నలుగురు బిడ్డల్నీ చూచేసరికి అతని మనస్సు సముద్రంలా ద్రవించిపోయింది.

'అమ్మా! ఎల్లావుందీ?' అంటూ తల్లి ఒంటిమీద చెయ్యేసి చూచేసరికి ఆవిడ శరీరం నిప్పులు క్రక్కతోంది.

'మామూలుగానే వుంది నాయనా! వెళ్లు!! అన్నం తిను!!!' అంటూ తనబాధను కప్పిపుచ్చుకు మాతృప్రేమతో చెప్పింది.

'నీకెల్లావుంది?' అన్నాడు భార్యని.

'మామూలుగానే వుంది. అలవాటేగా నాకు?' అంది నీరసంతో భార్య.

'అదేమిటి? ఇవ్వాళ అంత ఆయాసపడుతున్నావ్?' అన్నాడు.

'ప్రాణాలున్నంతవరకూ ఈ బాధ ఇల్లా వుండేదే?' అంది నిరాశగా.

'నాన్నా! అమ్మకి ఇవ్వాళ ఏమీ బాగుండలేదు. మీ మేనేజరుగారిని అడిగి ఏమైనా డబ్బు తెస్తే డాక్టరుకు చూపిద్దాం!' అన్నాడు పెద్దకొడుకు.

'లాభం లేదు' అన్నాడు నిరాశగా కోటయ్య.

'ఫరవాలేదు నాన్నా! నేనుకూడావస్తా - పద అడుగుదాం!' అంటూ పెద్దకొడుకు రాజు లేచేసరికి విధిలేక వానివెనకాలే నడిచాడు కోటయ్య.

ఆకలి కారుచిచ్చులా దహించుకు పోతోంటే, కుక్కలు మొరుగుతోన్నా లెక్కచెయ్యకుండా ఆ గాఢాంధకారంలోనే తిన్నగా మేనేజరు ఇంటికి వెళ్లారు ఆ తండ్రికొడుకులు.

మేనేజరుగారు ఇంట్లో లేరని, అవసరమైతే వచ్చే వరకూ బయట కూర్చోమని చెప్పింది మేనేజరు భార్య.

'అమ్మగారూ!' అతిదీనస్వరంతో పిల్చాడు కోటయ్య.

'ఎందుకు?' అంటూ హుందాగావచ్చి వెనక్కి నడ్డికి చేతులుకట్టి గర్వంగా నిల్చుని అడిగింది.

'అమ్మగారూ! మా అమ్మకు చాలా జబ్బుగా వుందండీ! జ్వరంతో నానాటికీ క్షీణించి......అది చాలా ప్రమాదస్థితికివచ్చింది. మందు కొందామన్నా; ఇంజెక్షన్లు చేయిద్దామన్నా చేతిలో ఒక్కకానీకూడా లేదండీ. తమరు దయవుంచి ఓ పాతికరూపాయ లిప్పిస్తే...మళ్ళీ నెలలో తీర్చుకొంటూ' అంటూ ఎంతో జాలిగా బాధగా అడిగాడు కోటయ్య.

'ఆ! పెద్దవాళ్ళు కలకాలం కట్టకట్టుకు కూర్చుంటారా? నీ చేతులమీదుగా వెళ్ళిపోవడమేకదా ఆ తల్లికి......''

'అయినా కన్నతల్లికి ఓ మందూ మాకూ ఇవ్వకుండా చేతులారా పోగొట్టుకోడానికి...'

'ఏ ఆకో అలమో; వెయ్యి ఆయువున్నంతవరకూ...' అంటూ నిస్సారంగా అనేసింది.

'మా అమ్మ పెద్దది కాబట్టి పోనీ వదిలేసినా...నా భార్య చూలాలు కదాండీ?......వారంరోజులనుంచి ఆయాసంతో ఎగశ్వాసేకాని దిగ ఊపిరిలేదు. ఏవో రెండుమందుసీసాలు, ఇంజెక్షన్లు తెచ్చుకోమన్నారు. అన్నింటికీ పాతికరూపాయలైనా అవుతాయి...నల్గురు బిడ్డలతల్లి అయిదో కాన్పండి. ఆ మందులు ఇవ్వకపోతే బ్రతకడం కష్టమని చెప్పారు. ఇంట్లో పిల్లలకికూడా కడుపునిండా తిండిలేదు. ఒక్కనెలజీతం ముందుగా ఇస్తే...ఎల్లాగయినా అప్పు తీర్చుకుంటానండి, మీరు తప్ప మా కెవరున్నారండి?......'అంటూ కన్నీళ్ళ పర్యంతం తెచ్చుకు అడిగాడు కోటయ్య.

'డాక్టరు వైద్యం ప్రారంభిస్తే ఆగడం కష్టం. మహామహులే ఇంగ్లీషు వైద్యం చేయించుకోలేక చస్తోంటే నెలకి యాభైరూపాయలు తెచ్చుకుంటూ ఇంత సంసారం పోషించుకోవల్సిన వాడివి...ఇటువంటి మందును కొనుక్కు డాక్టరుకి ఫీజులిచ్చుకు నువ్వెక్కడ తంటాలు పడగలవు కోటయ్యా! ఓ పావలా ఇచ్చి ఏ ఆయుర్వేదం

'కావాలంటే ఈ మద్రాసు పట్నంలో ఓ చోట నౌకరీ వుంచుతానే కాని నాభార్యను మాత్రం...'

'కోటయ్యా! అదే నీ అడ్డదారి ఆలోచన-చదువు సంధ్య లేకపోబట్టే నువ్వింత కష్టపడి ఒళ్లువిరుచుకు ఎముకలు పిండిఅయ్యేలా చాకిరీ చేస్తున్నావు. మళ్లీ నీ కొడుకునికూడా నీకంటే కష్టజీవిలా తయారుచేస్తావా? తరతరాలా మీ బ్రతుకులు ఇల్లాగే సాగించడంకంటే మీ పిల్లలనైనా అభివృద్ధికి తెచ్చుకోడానికి ప్రయత్నించకూడదా? నిజంగా ఇప్పట్లో నువ్వే జబ్బుపడ్తే?...నీ భార్యా బిడ్డల గతేమిటో కొంచెం ఆలోచించుకో...'

'పరువు చంపుకు పెళ్లాన్నికూడా పనికిలోకి పంపించడానికి నేనేం కూలివాణ్ణికాదుకదాండీ?...'అభిమానం దెబ్బతిన్నా రోషంతో అడిగాడు కోటయ్య.

'నీకంటే కూలివాడైనా మెరుగేనోయ్. కూలివాని భార్య అయితే కేవలం భర్తమీద ఆధారపడివుండక్కర్లేదు. ఒకే యజమాని దయాదాక్షిణ్యాలపై వుండవల్సిన అవసరమూ లేదు...'కొంచెం కోపంగానే అంది ఆమె.

'అయితే మా అమ్మమాత్రం ఏంపని చెయ్యగలదు ఆవిడసలు చదువుకోలేదుగదాండీ?' అన్నాడు అంతవరకూ విన్న కోటయ్యకొడుకు పదేళ్లవాడూ.

'మీ అమ్మని చెయ్యనిస్తానంటే నే నిప్పిస్తా ఓ ఉద్యోగం. నెలకి యాభై రూపాయల జీతం. పైగా జీతంకూడా ప్రతీ సంవత్సరం ఇంకా పెరుగుతుంది. ఈ సహాయంమాత్రం మీకు నే చెయ్యగలను.' అంటూ ఆ కుర్రాడివైపు చూస్తూ చెప్పింది ఆవిడ.

'మీ యిష్టం. అల్లాగే చెయ్యమంటాను. కాని... ఇంట్లో పిల్లలు...సంసారం...'

'కోటయ్యా! అందుకు అనుకూలమైనపనే ఇప్పిస్తాను. మ్యునిసిపల్ గర్ల్సుస్కూల్లో మెయిడ్ సర్వెంట్ పని... ప్రొద్దుట ఏడుగంటలు మొదలు...మధ్యాహ్నం రెండు గంటలనుంచీ...స్కూల్లో అన్నిపన్లూ చెయ్యాలి. ఒక్క పదేళ్లల్లో నీ పిల్లలూ చదువుకొని వృద్ధిలోకి వస్తారు. సంసారంలోనూ సగం ఇబ్బందులు గడుస్తాయి...'

'ఇప్పుడీరోగం తగ్గడానికి...'



'నీయింట్లో అందరికీవుండే జబ్బు ఒక్కటే. ఆకలి బాధ-కడుపునిండిన తిండివుంటే మళ్లీ వారంనాటికి అందరూ మామూలు స్థితికి వస్తారని నేను హామీ ఇవ్వగలను.'

ఒకొక్కప్పుడు వారాల తరబడి పస్తులున్నా రోజులుకూడా గుర్తుకు తెచ్చుకు మీయిష్టమండి. అల్లాగే చేస్తాను' అన్నాడు బాగా ఆలోచించి కోటయ్య.

అంతలో లోపలనుంచి మేనేజరుగారు బయటకువచ్చి 'ఏం కోటయ్యా! ఒప్పుకొన్నట్లేనా?' నవ్వుతూ అడిగాడు.

అంతవరకూ మేనేజరుగారు ఇంట్లో లేరనుకొని ధీమాగా మాట్లాడ్తూన్న కోటయ్య ఆయన్ని చూచి నిర్ఘాంతపోయాడు.

'మరేం భయపడకు కోటయ్యా! నీకు ఉపకారం చెయ్యాలనీ, నీకుటుంబం సుఖంగా వుండాలనీ, ఎప్పుడూ నీ శ్రేయస్సునే కోరి నేనెన్నోసార్లు నీకు హితోపదేశం చేసాను. అయినా నువ్వే నాడూ అంగీకరించకపోవడంతో...నిన్ను అప్పుల్లోనుంచి చిక్కులు తేవడం ఇష్టంలేక—ఇన్నాళ్లకి నీభార్యకూడా నౌకరీ చెయ్యడానికి నువ్వు అంగీకరించడంతో ఇంక నీబిడ్డలు బాగుపడ్తారని నామనస్సుకి ఆనందంగా వుంది—లోకం మెప్పుకోసం, డాంబికాచారాలకి లొంగక హాయిగా బ్రతకండి. ఇవిగో యాభై రూపాయలు. నీ అవసరాలను తీర్చుకొని ముఖ్యమైనవాటికి ఖర్చుచేసుకో. ఇవి నా సంతోషపూర్వకంగా నీకు సహాయంచేస్తున్నా. మీయింట్లో ఎవ్వరికీ ఏలాంటి అపాయమూ రాకుండా త్వరలోనే ఆరోగ్యవంతులౌతారని డాక్టరు నిన్ననే చెప్పాడు. నువ్వేమీ ఖంగారుపడకు కోటయ్యా!' అన్నాడు మేనేజరు.

'మా అమ్మ అంగీకరించాక నా భార్య నౌకరీమాట చెప్తానండి. మాకులంలో ఆడవాళ్లు అసలు బయటికి రావడానికే ఒప్పుకోరు. అటువంటిది...'

'కోటయ్యా! అవన్నీ ఇదివరకే మీఅమ్మతో చెప్పాను. నువ్వు కనుక 'ఊ' అంటే; ఇంక ఏలాంటి ఆటంకం లేదు. కూటికిలేక మలమలామాడి ఛస్తాంటే, కులం పట్టింపు, అంటూ వెనక్కినడిచేవాళ్లుకారు మీ అమ్మ,

నీ భార్యకూడా. కుటుంబ మర్యాదకోసం యజమానివి కనుక నీ అనుమతికై ఎదురుచూస్తున్నారు.' అంది ఆవిడ చాలా సీరియస్‌గా.

'సరేనండి. ఎల్లుండి ఒకటో తారీకునుంచి నా భార్య పనిలో ప్రవేశిస్తుంది' తల ఒంచుకునే జవాబిచ్చాడు అడితప్పని కోటయ్య.

'చాలా సంతోషం కోటయ్యా! ఒక్క పదేళ్లలో నీ కొడుకుల్ని పట్టభద్రుల్ని చేసే బాధ్యత నాది.' అన్నాడు ఆనందంగా మేనేజరు.

భార్యను పనిలోకి పంపాలనే నిశ్చయాభిప్రాయానికి వచ్చి అదే ఆలోచనతో ఇంటికి నడక సాగించాడు కోటయ్య. ఆరోజు మధ్యాహ్నమే తన తల్లి, భార్య, మేనేజరు దంపతులు కలిసి సంప్రదించుకొన్న విషయాలు కోటయ్యకేం తెలుసు?—గుమ్మంలోకి వచ్చిన కోటయ్యతో 'మేనేజరుగారు, భార్య కనిపించారా?' అనడిగింది తల్లి.

'వారి ఉపదేశానికి నాన్న ఒప్పుకొన్నాడు మామ్మా!' అన్నాడు రాజు నవ్వుతూ,

ఆమాట వినేసరికి ఇంట్లో అందరి నీరసాలు ఎగిరిపోయి, నూతనానందం, సత్తువ కల్గినట్లు కలకల్లాడిపోయాయి వారి ముఖాలు. తల్లి కళ్లు ఆనందంతో మెరుస్తూ ఆశీస్సులిచ్చాయి.

●

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ బాధ్యులు కాము.

—సంపాదకుడు

